# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-04-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్య యోజన ద్వారా గ్రామీణ పేద యువతకు నైపుణ్య శిక్షణ, ఆర్థిక సాధికారత అందుతోందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.**

2. **అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు.**

3. **నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.**

4. **ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి, వారి పవిత్ర యాత్రలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎమ్ డీ ఫరూక్ వెల్లడించారు.**

=========================

దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్య యోజన ద్వారా గ్రామీణ పేద యువతకు సమయానుకూల నైపుణ్య శిక్షణ, ఆర్థిక సాధికారత అందుతోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లా తెనాలి మండలంలోని బుర్రిపాలెం గ్రామంలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ్ కౌశల్య యోజన కింద శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను ఆయన ఈరోజు అందజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ..

వాయిస్.. 30 సెకన్లు

-------------------------

గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బాపట్ల జిల్లా రేపల్లె మండల కేంద్రంలో 6 కోట్ల రూపాయలతో 33/11ఖ౨ సెమి ఇండోర్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులకు ఈరోజు రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి.వినోద్ కుమార్, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, రేపల్లె ఆర్డీఓ బి. శ్రీదేవి, విద్యుత్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

-------------------------

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి

కొలుసు పార్థసారథి తెలిపారు. బాపట్ల జిల్లా ఆరవ పల్లిలో సి.ఆర్. ఐ.ఎఫ్ నిధులు 49 కోట్ల రూపాయలతో రేపల్లె నుంచి తుమ్మల – గంగడిపాలెం రోడ్డు నిర్మాణ పనులకు రెవిన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ తో కలిసి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు.

-----------------------------

నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. విజయనగరంలోని వేణుగోపాలపురంలో విద్యుత్ ఉపకేంద్రం నిర్మాణానికి ఆయన నిన్న శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి విద్యుత్ ఉపకేంద్రాలను ప్రభుత్వం నిర్మిస్తోందని చెప్పారు. ఇకపై జిల్లా కేంద్రంలో విద్యుత్ వినియోగదారులకు లో ఓల్టేజ్ సమస్య ఉండదన్నారు.

-----------------------------

జిల్లాలోని సముద్ర తీర ప్రాంతాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని బాపట్ల జిల్లా కలెక్టర్ వి. వినోద్ కుమార్ తెలిపారు. జిల్లాలోని వేటపాలెం మండలం రామాపురం సముద్ర తీరంలో నూతనంగా ప్రారంభించనున్న అడ్వెంచర్ స్పోర్ట్స్, ప్యారా గ్లైడింగ్ ను ఆయన నిన్న చీరాల శాసనసభ్యులు ఎంఎం కొండయ్యతో కలిసి పరిశీలించారు. జిల్లాలో టూరిజాన్ని మరింత అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లుగా కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొంటూ..

వాయిస్.. 30 సెకన్లు

-----------------------------

ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి, వారి పవిత్ర యాత్రలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎమ్ డీ ఫరూక్ తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరంలో రెండో విడత హజ్ యాత్రికుల ప్రయాణాన్ని జెండా ఊపి ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నేడు చివరి విడతగా 179 మంది యాత్రికులు పవిత్ర హజ్ యాత్రకు వెళ్లినట్లు చెప్పారు. భవిష్యత్తులో యాత్రికుల సంఖ్యను పెంచేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని వివరించారు.

-----------------------------

దేశ వ్యాప్తంగా మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 8వ పోషణ్ పఖ్వాడా--2026 కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ సంవత్సరం పోషణ్ పఖ్వాడా శిశువుల్లో 'మొదటి ఆరు సంవత్సరాల్లో మెదడు అభివృద్ధి గరిష్టంగా పెంపొందించడం' అనే ఇతివృత్తంతో నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు, పోషణ పంచాయతీలు, ఆటల ఆధారిత అభ్యసన కార్యక్రమాలు చేస్తున్నారు. చిన్నారుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి, స్క్రీన్ టైమ్ తగ్గింపు వంటి అంశాలపై ప్రచారం చేపట్టారు.

-----------------------------

ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు బెటర్ మెంట్ పరీక్షలకు అవకాశం కల్పిస్తున్నట్లు ఇంటర్ విద్యామండలి డైరెక్టర్ రంజిత్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 21వ తేదీ నుంచి జూన్ 4వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని, ఈనెల 27వ తేదీ లోపు ఫీజు చెల్లించాలని వెల్లడించారు. ప్రాక్టికల్ పరీక్షలకు మాత్రం ఇంప్రూవ్‌మెంట్ అవకాశం లేదని, మొదటి సంవత్సరం తరహాలోనే రెండో సంవత్సరం విద్యార్థులకూ బెటర్

మెంట్   పరీక్షలు ఉంటాయని వివరించారు.

---------------------------

రైతులు రసాయన ఆధారిత వ్యవసాయానికి దూరమై, సహజ వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ప్రకృతి వ్యవసాయదారుల సమ్మేళనం, ప్రదర్శన నిన్న నిర్వహించారు. ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం  సేంద్రియ రైతులను ప్రోత్సహించడం చాలా అవసరమని టీటీడీ పాలక మండలి సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి తెలియజేస్తూ..

వాయిస్.. 25 సెకన్లు

---------------------------

పాలిసెట్ –2026 హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చినట్లు  రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణ మండలి కార్యదర్శి జి.వి.వి.సత్యనారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షను ఈ నెల 25వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను వాట్సప్ గవర్నెన్స్ నంబర్ 95523 00009కు మెసేజ్ చేసి, లేదా అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వెల్లడించారు.

---------------------------

ఇండియన్ ప్రీమియర్ లీగ్ – ఐపీఎల్ 2026లో కోల్‌కతా నైట్ రైడర్స్,  రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య మ్యాచ్ ఈరోజు జరగనుంది.  కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ క్రికెట్ స్టేడియంలో  ఈ మధ్యాహ్నం మూడున్నరకు మ్యాచ్ ప్రారంభం కానుంది. మరో మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లు తలపడనున్నాయి. న్యూ చండీగఢ్ లోని మహారాజా యదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఈ రాత్రి ఏడు గంటల 30 నిమిషాలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. నిన్న జరిగిన  మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు పై  ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు విజయం సాధించగా, మరో మ్యాచ్ లో చెన్నై సూపర్ కింగ్స్ పై సన్‌రైజర్స్ హైదరాబాద్  జట్టు గెలుపొందింది.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 133 వ సంచిక ఈనెల 26వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. “మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 టోల్ ఫ్రీ నెంబర్‌కు, మై జి.ఓ.వి డాట్ ఇన్ వెబ్‌సైట్‌కు, నరేంద్రమోదీ యాప్‌కు ఈ నెల 24వ తేదీ వరకు పంపవచ్చు.

=====================